నాగ్‌పూర్ హైవే అలైన్‌మెంట్ మార్చాలి

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో గణేష్

రఘునాథపాలెం, ఆగస్టు 24 : అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలని బాధిత రైతులు ఖమ్మం ఆర్డీవో అశోక్‌ను కోరారు. శనివారం ఖమ్మం ఆర్డీవో కామంచికల్ గ్రామంలో హైవే ఎలైన్‌మెంట్‌లో భూములను కోల్పోతున్న రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను భూ సేకరణకు సహకరించాలని, ఆర్బిటేషన్‌కు హాజరుకావాలని కోరారు. దీనిపై రైతులు స్పందిస్తూ ప్రస్తుత హైవే అలైన్‌మెంట్‌ను వ్యతిరేకించారు. తీర్థాల నుంచి కొదుమూరు వరకు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. రాంబాబు, శ్రీధర్, సుధీర్, రాధాకృష్ణ, శ్రీను, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, రఘు, గాంధీ, నరసయ్య పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్, ఆగస్టు 24: నాగపూర్-అమరావతి జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని బాధిత రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. శనివారం కామంచికల్ గ్రామానికి చెందిన రైతులు నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రాంప్రసాద్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రైతుసంఘం కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. తీర్థాల నుంచి కొదుమూరు వరకు అలైన్‌మెంట్ మార్చాలన్నారు. అనంతరం పలు డిమాండ్లకు వినతిపత్రం అందజేశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

గ్యాస్ సిలిండర్‌కు అదనంగా డబ్బులు తీసుకోవద్దు
పెట్రోల్‌బంకుల్లో మరుగుదొడ్లు, గాలిమిషన్లు ఉండాలి
అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఖమ్మం, ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి విజిలెన్స్ సమావేశం నిర్వహించారు. చౌకధరల షాపులకు బియ్యం పంపిణీ, ప్రభుత్వ వసతిగృహాలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం పంపిణీ విషయమై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సన్నబియ్యం నాణ్యత విషయంలో అధికారులు పరిశీలన చేయాలన్నారు. బియ్యం భద్రపరచడం, ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వసతిగృహాలకు చేరవేయడంపై సూచనలు చేశారు. డీలర్లు సమయపాలన పాటించాలని, షాపులో స్టాక్ బోర్డు, స్టాక్ రిజిష్టర్, డీలర్ లైసెన్స్ ప్రదర్శించాలని తెలిపారు. జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలతో సమావేశం చేపట్టి, వినియోగదారుల వద్ద అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్ బంకు యజమానులు, కంపెనీల సేల్స్ అధికారులతో చర్చించారు. ప్రతి బంకులో మరుగుదొడ్లు, గాలి మిషన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు ప్రమీల, ఆవుల శిరీష, సంబంధిత షాపుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఖమ్మం ఎంపీ

గవర్నర్‌తో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం, ఆగస్టు 24: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తన తండ్రి, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డితో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా ఆధ్యాత్మికం, పర్యాటకంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఇటు ఖమ్మంఖిల్లా, దక్షిణ ఆసియాలోనే పెద్దదైన బౌద్ధ స్తూపం, కూసుమంచిలో కాకతీయులు నిర్మించిన శైవాలయం.. అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతారామచంద్రస్వామి దేవస్థానంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సింగరేణి, పలు కేంద్రీయ పరిశ్రమలు, ప్రాజెక్టులు, అటవీ సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. గవర్నర్‌గా ఉమ్మడి ఖమ్మంజిల్లా పర్యటనకు వస్తే మరింత ప్రాచుర్యం లభిస్తుందని, వీలైనంత త్వరగా రావాలని కోరారు.

పెద్దాసుపత్రిని సందర్శించిన కేఎంసీ కమిషనర్..!

పెద్దాసుపత్రిలో మురికి గుంతను పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ అగస్త్య, వైద్యాధికారులు

ఖమ్మం సిటీ, ఆగస్టు 24 : జిల్లా సార్వజనీన ఆసుపత్రిని శనివారం నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. తొలుత ప్రాంగణంలోని క్యాంటీన్‌ను పరిశీలించారు. అనంతరం మాతా, శిశు సంరక్షణ, మార్చురీ తదితర విభాగాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఎంసీహెచ్‌తోపాటు ఎదురుగా ఉన్న మురికిగుంతలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీధిలైట్లు ఏర్పాటు, సరిపడా మంచి నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితోపాటు మార్చురీ వెనక భాగంలోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, విచ్చలవిడిగా తిరుగుతున్న వీధికుక్కలను నియంత్రించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఆగస్త్య ఆయా సమస్యలన్నింటినీ వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవోలు డాక్టర్ కళావతిభాయి, డాక్టర్ వినాయక రాథోడ్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

ఖమ్మం, ఆగస్టు 24 : ఖమ్మం నగరంలో డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శనివారం 28వ, 44వ డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. డెంగీ జ్వరం సోకిన వారి ఇండ్ల వద్దకు పరిసరాలను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కూలర్లు, రోల్లు, డబ్బాలు, గాబులు, ముంతలు, కుండలు, కొబ్బరిచిప్పలు, పాతగిన్నెలు లాంటి వాటిలో నీరు ఆగి ఉంటే డెంగీ దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో డ్రై డే చేపట్టాలని సూచించారు.

ఎస్‌బీఐటీలో గ్రాడ్యుయేషన్ డే

సర్టిఫికెట్స్ అందజేస్తున్న గుండాల కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 24: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2020-24 విద్యా సంవత్సరంలో బీటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ బీవీ రామనరేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గత 21 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్యను అందిస్తూ ఈ సంవత్సరం న్యాక్ ఏ ప్లస్, అటానమస్ హోదాను సాధించడం గర్వకారణమన్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశను ముగించుకుని ఉద్యోగ దశలోకి అడుగుపెడుతున్న విద్యార్థులను, కృషిచేసిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధిర పట్టణంలో వైద్య శిబిరాలు

మధిర, ఆగస్టు 24: మధిర మండల పీహెచ్‌సీ, దెందుకూరు వైద్యులు డాక్టర్ పృథ్వీ నాయక్, పారా మెడికల్ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలో ముస్లింబజార్, ప్రకాశం రోడ్డులో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, డాక్టర్ హేమలత ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ వీ.వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో ఎస్.గోవిందు, హెచ్ఎస్ సుబ్బలక్ష్మి, హెచ్‌వీ సరోజినీదేవి, పారామెడికల్ బృందాలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం వీ.విజయకుమారి, వై.లక్ష్మి, జీ.విజయలక్ష్మి, సావిత్రి, గుర్రం శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు రజిని, నాగమణి, ముంతాజ్, అజిమున్నీస్సా, మెప్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు సామ్రాజ్యం, పద్మావతి పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో జ్వర సర్వే..

ఎర్రుపాలెం, ఆగస్టు 24: బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాకేత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వైద్య సిబ్బంది శనివారం జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాకేత్‌రెడ్డి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసార వంటి వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సర్వేలో కాంతమ్మ, వేణుగోపాల్, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, స్నేహ, నరేష్, విజయ, రమణ, కోటమ్మ, హేమలత పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

మధిర, ఆగస్టు 24: ఈ నెల 20 నుంచి నిర్వహిస్తున్న సమగ్ర ఓటరు నమోదు సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాలబండి రాంబాబు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రత్యేకమైన యాప్ ద్వారా ఓటరు నివేదికలను అనుసరించి గ్రామస్థాయిలో వార్డుల స్థాయిలో ఇంటింటికి ఓటర్ల జాబితాను పరిశీలించి ధ్రువీకరణను నమోదు చేయనున్నారని తెలిపారు. నిడమానూరి వంశీ, రమేష్, నాగేశ్వరరావు, పుల్లారావు, జగన్, భాస్కర్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

బోనకల్లు, ఆగస్టు 24: రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ రైతుసంఘం నాయకులు వేమూరి ప్రసాద్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

జేఎన్‌టీయూ ఫలితాల్లో ప్రియదర్శిని ప్రతిభ

ఖమ్మం రూరల్, ఆగస్టు 24: జేఎన్‌టీయూహెచ్ విడుదల చేసిన మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ కాట్రపల్లి నవీన్‌బాబు తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో సదరు విద్యార్థినులను అయన అభినందించారు. ప్రిన్సిపాల్ బీ గోపాల్, డైరెక్టర్ వీరబాబు పాల్గొన్నారు.

కేజీఎంసీకి 15మంది విద్యార్థుల కేటాయింపు

ఖమ్మం సిటీ, ఆగస్టు 24: నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వైద్య విద్యకు కౌన్సిలింగ్ షురూ అయ్యింది. దీనిలో భాగంగా ఆల్ ఇండియా కోటాకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో చేరేందుకు గాను 15మంది విద్యార్థులు ఖమ్మం గవర్నమెంట్ కాలేజీకి కేటాయించబడ్డారు. వారంతా ఢిల్లీ, రాజస్థాన్, బీహార్, కేరళ, ఏపీ తదితర రాష్ట్రాలకు చెందిన వారుగా తెలిసింది. గత కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మిగతా 85 సీట్లు పొందేందుకు కేవలం తెలంగాణ విద్యార్థులు మాత్రమే అర్హులు. వీరికి ఈనెల 30వ తేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రథమ సంవత్సరానికి కౌన్సిలింగ్ తర్వాత వెంటనే అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేసి అక్టోబర్ 1వ తేదీ నుంచి తరగతులు కొనసాగిస్తామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. కాగా..! ఆల్ ఇండియా కోటాలో ఖమ్మం కళాశాలకు అర్హత పొందిన విద్యార్థులు మంగళ, బుధవారాల్లో వచ్చే అవకాశం ఉందన్నారు.

విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : నగరంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో శనివారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా స్కూల్స్‌లో కరస్పాండెంట్స్, డైరెక్టర్స్ పాల్గొన్నారు.

సరస్వతి విద్యాలయంలో..

తిరుమలాయపాలెం, ఆగస్టు 24: మండలంలోని దమ్మాయిగూడెం సరస్వతీ విద్యాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషాధారణలో అందరినీ అలరించారు.పాఠశాల కరస్పాండెంట్ బానోత్ శ్రీనివాస్, అకడమిక్ అడ్వైజర్ మమత రాణి, ప్రధానోపాధ్యాయులు వెంకోబ పాల్గొన్నారు.

స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో..

ఖమ్మం రూరల్, ఆగస్టు 24: మండలంలోని హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో శనివారం సంబురంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల సెక్రెటరీ, కరస్పాడెంట్ రవిమారుతి, ప్రిన్సిపాల్ ఆర్ పార్వతిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్రింగ్ లీఫ్ ప్రిన్సిపాల్ బీ రవిశంకర్, హెచ్ఎం ప్రీతి, చందన, యాకయ్య, సరస్వతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మధిర, ఆగస్టు 24: మధిర పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, కృష్ణుల వేషధారణలో అబ్బురపరిచారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎడ్యుకేషన్ : గీతాంజలిలో..

ఖమ్మం ఎడ్యుకేషన్ : హార్వెస్ట్‌లో..

ఖమ్మం ఎడ్యుకేషన్ : సర్వజ్ఞ పాఠశాలలో..

ఖమ్మం ఎడ్యుకేషన్ : రెజోనెన్స్ శ్రీనగర్ పాఠశాలలో..

ఖమ్మం ఎడ్యుకేషన్ : టైనిటాట్స్‌లో..

బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో..

మధిర : ఉట్టి కొడుతున్న చిన్నారులు

ఖమ్మం రూరల్ : స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో..

తిరుమలాయపాలెం : సరస్వతి విద్యాలయంలో..

ఉట్టి కొడుతున్న చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం : ఎమ్మెల్యే

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

వేంసూరు, ఆగస్టు 24 : అంగన్‌వాడీ కేంద్రాల్లో దోపిడీ, నిర్లక్ష్యం వంటి వాటిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొడ్రుగట్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, పల్లెదవాఖానాను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, ఆటలు ఆడించాలని సూచించారు. అనంతరం పల్లెదవాఖానాను పరిశీలించి ప్రస్తుత ఆరోగ్య, అనారోగ్య వివరాలు తెలుసుకొని పల్లె దవాఖానా సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ, సాధికారతపై అవగాహన

మహిళా రక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొణిజర్ల, ఆగస్టు 24 : మండలంలోని తనికెళ్లలో తెలంగాణ గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో మహిళలు, బాలల రక్షణ, వారికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు, చట్టాలు, లింగ సమానత్వంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ ఎస్.డీ.సమ్రీన్, పీ.ప్రమీల, కే.సరిత, సఖి అడ్మినిస్ట్రేటర్ పాల్గొని విద్యార్థినులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించి హెల్ప్‌లైన్ నెంబర్లు తెలిపారు. అదేవిధంగా ట్రైనీ డాక్టర్ మౌమితకు విద్యార్థినులు, అధ్యాపకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ, సీజీసీ కోఆర్డినేటర్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే

పెనుబల్లి, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-4 కేంద్రంలో శనివారం ఈసీసీఈ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ ఈసీసీఈ డే గురించి వివరించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలను ప్రైవేటు బడులకు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ ఎం.కృష్ణకుమారి, ఐ.పద్మరాజకుమారి, రాజేశ్వరి, లూర్థమ పాల్గొన్నారు.

రామయ్య సేవలు మరువలేనివి

వేంసూరు, ఆగస్టు 24: దున్నే వారికి భూములు పంచిన ప్రజానేత అమరజీవి ఎర్ర రామయ్య అని సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని లింగపాలెంలో రామయ్య విగ్రహం వద్ద సీపీఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ అధ్యక్షతన రామయ్య 62వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడారు.

బాల సాహిత్య కార్యశాల

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బాల సాహిత్య కార్యశాల నిర్వహించారు. ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు కవిత్వం, కథ ఎలా రాయాలో కవి, రచయిత అట్లూరి వెంకటరమణ వివరించారు. విద్యార్థులకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కొంద్రు బ్రహ్మం, లూర్దుమేరీ, నాగేందర్, శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో న్యూవిజన్‌కు ప్రథమస్థానం

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన యూ జీనియస్ జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారని పాఠశాల చైర్మన్ చుంచు గోపాలకృష్ణ ప్రసాద్ తెలిపారు. రాష్ట్రం నుంచి 350కిపైగా స్కూల్స్ పాల్గొనగా న్యూవిజన్ నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొని సత్తా చాటారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ గొపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ కార్తీక్ అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఖమ్మం, ఆగస్టు 24 : నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను నగర పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. త్రీటౌన్ ప్రాంతంలోని 46, 48, 35, 36, 30, 33, 32వ డివిజన్లలో చెక్కులు పంపిణీ చేశారు.

మధిర రూరల్, ఆగస్టు 24: మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన శీలం తిరుపతమ్మకు డిప్యూటీ సీఎం భట్టి కృషితో మంజూరైన రూ.16వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత మహిళకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్ శనివారం అందజేశారు.

కాపర్ వైర్ చోరీ

తిరుమలాయపాలెం, ఆగస్టు 24: మండలంలోని దమ్మాయిగూడెం గ్రానైట్ క్వారీ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మను గుర్తుతెలియని వ్యక్తులు పగులకొట్టి అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. వైరు విలువ రూ.25000 ఉంటుంది. బచ్చోడు విద్యుత్ ఏఈ శంకర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం, ఆగస్టు 24: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామునే స్వామివారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు ధరింపచేసి ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పించారు.

ల్యాప్‌టాప్‌లు అందజేత

మధిర, ఆగస్టు 24: విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల బీసీ గురుకుల కళాశాలలో పట్టణంలో వివిధ పరీక్షల్లో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. శిరీష, సుష్మ, సౌజన్య, సూరంశెట్టి కిశోర్, శీలం వెంకటరెడ్డి, శీలం విద్యాలత, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రమణగుప్త, వై.అనిల్‌కుమార్‌నెహ్రూ పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రైసైకిళ్లు పంపిణీ

బోనకల్లు, ఆగస్టు 24: మండల కేంద్రంలో దివ్యాంగులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను శనివారం పంపిణీ చేశారు. అనంతరం చైర్మన్ మల్లు నందిని మాట్లాడుతూ.. అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పైడిపల్లి కిశోర్, బంధం నాగేశ్వరరావు, గాలి దుర్గారావు, భూక్యా సైదానాయక్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, తమ్మారపు బ్రహ్మయ్య, భూక్యా పిచ్చేశ్వరనాయక్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

ఎర్రుపాలెం, ఆగస్టు 24: ఎం.వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు ఎం.రాంప్రదీప్ మండల పరిధిలోని గుంటుపల్లిగోపవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.స్వామి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ చెకప్

ముదిగొండ, ఆగస్టు 24: మండల కేంద్రంలోని గ్రానైట్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు హెల్త్ చెకప్ నిర్వహించారు. సీడీపీవో శారదశాంతి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాదుల నేపథ్యంలో హెల్త్ చెకప్ నిర్వహించామని తెలిపారు. బరువు తక్కువ పిల్లలపై శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.

ఔషధ మొక్కల పెంపకం

కొణిజర్ల, ఆగస్టు 24 : మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి ఔషధ మొక్కలను నాటి, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సీజీసీ, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-2** వారు ఇచ్చి